క్లుప్తంగా

చివరి ఆయకట్టు వరకూ నీరందించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో పంటల సాగుకు నీరు అందక ఎండిపోతున్నాయని, యుద్ధప్రాతిపదికన సాగునీరు అందించి పంటలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. గతంలో వారాబంధి కారణంగా పంటలు చేతికొచ్చే దశలో నీటి కొరత ఏర్పడిందని ఆయన తెలిపారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన తర్వాత ఇప్పుడు పంటలు నీరు లేక ఎండిపోకుండా ఆయకట్టు చివరి భూములకు నీటిని అందించాలని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించాలని కోరారు.

వైద్య శిబిరం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కేర్ హోమియోపతి సంస్థ సీఈఓ ఏఎం రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు జి.రాజేష్, బాబు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ కార్యదర్శి వి.అర్జున్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు, పెన్నులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ ప్రతినిధులు పేరాల శ్రీకాంత్, పుసులూరి రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయుడు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంపవర్' ఆధ్వర్యాన శానిటరీ న్యాప్‌కిన్స్..

నేలకొండపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు అమెరికాకు చెందిన ఎంపవర్ సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీహిత సౌజన్యంతో శానిటరీ న్యాప్‌కిన్స్‌లను బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని మంగాపురంతండా, రాయగూడెం, పైనంపల్లి, నాచేపల్లి , భైరవునిపల్లి, అప్పలనరసింహాపురం, నేలకొండపల్లి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతి విద్యార్థినులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు ఆధ్వర్యాన పెవిలియన్ గ్రౌండ్‌లో బుధవారం ఖమ్మం ప్రీమియర్ లీగ్(కేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. అనంతరం సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, 52వ డివిజన్ కార్పొరేటర్ బుర్రి వినయ్‌కుమార్‌తో పాటు జక్కుల లక్ష్మయ్య, జక్కుల వెంకట రమణ, గుమ్మడివెల్లి శ్రీనివాసరావు, వల్లూరి విజయ్, మీన మహేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు పనులు..

రఘునాథపాలెం: మండలంలోని మల్లేపల్లి గ్రామపంచాయతీకి శ్మశాన వాటికకు వెళ్లే మట్టి రోడ్డు నిర్మాణానికి బుధవారం చేపట్టిన పనులను గ్రామ సర్పంచ్ బండి వెంకన్న ప్రారంభించారు. గ్రామస్తులు వ్యవసాయపరంగా కూడా ఉపయోగపడే విధంగా కూడా ఈ రోడ్డు నిర్మాణం ఉంటుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాలోత్ రవి, వార్డు సభ్యులు అర్వపల్లి కోటయ్య, భూక్య గోరియా, గ్రామ అధ్యక్షుడు తేజావత్ వీరన్న నాయక్, అర్వపల్లి రమేష్, తేజావత్ సూర్య తదితరులు పాల్గొనారు.

ఒంటిపూట బడులు..

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం నుంచే విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకున్నాయి. కాగా, జిల్లాలోని వివిధ మండలాల్లోని ఎంఈఓలు ఆయా పాఠశాలలను సందర్శించి సూచనలు చేశారు.

'కంటి వెలుగు'..

రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తిలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీఓలు రామకృష్ణ,జయరాం, సర్పంచ్‌లు బాణాల వెంకటరెడ్డి, మెంటం రామారావుతో పాటు శంకర్, అజ్మీరా వీరూనాయక్, మాలోత్ లక్ష్మి, చిరుమామిళ్ల రవికిరణ్, తాతా వెంకటేశ్వరరావు, రహీంఖాన్, నాగేశ్వరరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

గూడు గోస తీరేనా..?

గృహలక్ష్మి పథకం కోసం పేదల ఎదురు చూపులు

- ప్రభుత్వ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- వేధిస్తున్న ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్య
- అరకొరగా 'డబుల్' ఇళ్ల మంజూరు
- కావాల్సినవి వందల్లో.. ఇచ్చేవి పదుల సంఖ్యల్లో..

ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తాం.. స్థలాలు లేని వారికి కూడా స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని.. ఇందుకు గృహలక్ష్మి పథకం త్వరలో అమలు కాబోతుందని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఇప్పటి వరకు గుడిసెలు, రేకుల ఇళ్లల్లో నివసిస్తున్న వారు, ఇళ్ల స్థలాలు లేని వారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తమ గూడు గోస తీరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని త్వరగా అమలు చేసి ఆదుకోవాలని పలువురు వేడుకుంటున్నారు.


కూసుమంచి మండలం గట్టుసింగారంలో ఓ కుటుంబం ఏర్పాటు చేసుకున్న రేకుల ఇల్లు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో నేటికి చాలా కుటుంబాలు పక్కా ఇళ్లు లేక, ఉన్న ఇళ్లు కాస్త శిథిలమై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నియోజకవర్గంలో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాల వారు ఉండడంతో.. వారు పక్కా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేదు. దీంతో వర్షాకాలం వస్తుందంటే చాలు వారు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో వేలాది మందికి పక్కా ఇళ్లు నిర్మించగా.. చాలామందికి ఇళ్ల సమస్య తీరింది. కాగా, నాటి నుంచి నేటి వరకు జనాభా పెరుగుదల, పలు కుటుంబాలు వివాహాల అనంతరం వేర్వేరుగా ఉండడంతో ఉన్న ఇల్లు సరిపోక.. కొత్తగా ఇళ్లు కావాలనే డిమాండ్ వారిలో ఏర్పడింది. ఈక్రమంలో వారు తాత్కాలికంగా రేకులు, గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు.

అరకొరగా 'డబుల్' ఇళ్లు..

గ్రామాల్లో ఇళ్ల సమస్య తీర్చేందుకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మిస్తున్నప్పటికీ అవి అరకొరగానే మంజూరు అవతున్నాయి. దీంతో సమస్య పూర్తిగా పరిష్కారం కావడం లేదు. ఇళ్లు కావాల్సిన వారు వందల సంఖ్యలో ఉంటే.. పదుల సంఖ్యల్లో ఇళ్లు నిర్మించి ఇస్తుండగా సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. ఇక డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో రాజకీయ జోక్యంతో నిజమైన పేదలకు అవి దక్కకుండా పోతున్నాయి. ఇళ్ల సమస్యతో పాటు ఇళ్ల స్థలాల సమస్య కూడా తీవ్రంగా వేధిస్తుంది. స్థలాలు లేని వారికి దిక్కులేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ కాలం వెళ్లదీస్తూ.. అష్టకష్టాలు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం పేదల కష్టాలు గుర్తించి పక్కా ఇళ్ల నిర్మించి ఇవ్వడంతో పాటు స్థలాలు లేని వారికి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా ఏళ్లుగా అద్దె ఇంట్లోనే..



మాకు సొంతిల్లు, ఇంటి స్థలం లేదు. చిన్నపాటి వ్యాపారంతో జీవనం సాగిస్తున్నా. చాలా ఏళ్ల నుంచి అద్దె ఇంటిలో ఉంటున్నాం. వచ్చే సంపాదన అద్దెలకే సరిపోతుంది. డబుల్ బెడ్రూం ఇంటికి దరఖాస్తు చేసుకున్నా.. ఇవ్వలేదు. ప్రభుత్వం ఈ సారైనా ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

– షేక్ మీరా, కూసుమంచి

రేకుల ఇంట్లో ఉంటున్నాం..



ఇల్లు కట్టుకునే స్తోమత లేక రేకులు వేసుకుని జీవనం సాగిస్తున్నాం. గవర్నమెంట్ ఇంటికి రూ. మూడు లక్షలు ఇస్తామని చెపుతుంది. మాకు ఇల్లు మంజూరి చేస్తే మరికొంత కలుపుకుని పక్కా ఇల్లు నిర్మించుకుంటాం. మా బాధలు తీరిపోతాయి. గృహలక్ష్మి పథకం త్వరగా అమలు చేయాలి.

– శీలం ఉపేందర్, గట్టుసింగారం

పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఏఈ పరీక్ష పేపర్ లీకేజీ బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్‌సీ బోర్డు చైర్మన్ రాజీనామా చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్, ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు తుడుం ప్రవీణ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఆర్టీఓ కార్యాలయం సెంటర్ వద్ద డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపించాలని, టీఎస్‌పీఎస్‌సీ బోర్డు చైర్మన్ రాజీనామా చేయాలని, బోర్డును ప్రక్షాళన చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, గోవర్ధన్, శుభాష్‌రెడ్డి, తరుణ్, వీరేందర్, మురళి, కళ్యాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

రఘునాథపాలెం: కుక్కకాటుకు గురై మృతి చెందిన బాలుడు బానోతు భరత్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గేషియా ప్రకటించి ఆదుకోవాలని టీపీసీసీ సభ్యుడు ఎం.డీ.జావీద్ డిమాండ్ చేశారు. మండలంలోని పుఠానీ తండాలో ఇటీవల కుక్కకాటుతో మృతి చెందిన భరత్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం కావటంతో ప్రజలు ప్రాణం కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. గిరిజన బాలుడు మృతి చెందితే ప్రభుత్వం స్పందించకపోవడం గర్హనీయమన్నారు. కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, నాయకులు భూక్యా బాలాజీ, రెంటాల ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం : కాన్షీరాం 89వ జయంతిని బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆయా సంఘాల కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల చైర్మన్లు డాక్టర్ కేవీ కృష్ణారావు, పాల్వంచ రామారావు మాట్లాడుతూ.. కాన్షీరాం ఆశయ సాధనకు బహుజనులు రాజ్యాధికార దిశగా పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు చేకూరి చైతన్య, కో కన్వీనర్ భద్రూనాయక్, వెంకటరమణ, కోమలి, లిక్కి కృష్ణారావు, డాక్టర్ బి.రాఘవులు, మస్తాన్, సోమరాజు, శ్రీనివాస్, రమ్య, చంద్రశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని రాధాక్రిష్ణనగర్‌లోని ది ఆంధ్రా బ్యాంక్ కర్షకసేవా సంఘం లిమిటెడ్ ఆధ్వర్యాన నిర్మించే కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి ఆధ్వర్యాన ఎండీ, డైరెక్టర్లు బుధవారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీసీ(నేషనల్ కోఆపరేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఉన్నతాధికారులను కలిసి ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో కేటాయించిన ప్రభుత్వ భూమిలో కోల్డ్ స్టోరేజీ నిర్మించనున్నట్లు వివరించారు. దీనికి సానుకూలంగా అధికారులు స్పందించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లింగా నాగార్జునరావు, రావెళ్ళ కిషన్, సంఘ మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు

కూసుమంచి: మండలంలోని గంగబండతాండాకు చెందిన వడిత్య వినోద ఈ నెల 18 నుంచి జరిగే అంతర్జాతీయ ఇన్విటేషన్ మహిళా టీ–20 క్రికెట్ పోటీలకు భారత జట్టు తరపున ఎంపికైంది. బుధవారం నేపాల్ క్రికెట్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ పోటీలకు ఎంపిక కావటం పట్ల మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, సర్పంచ్ బాణోత్ కిషన్ నాయక్, మాజీ ఎంపీటీసీ నాగేశ్వరరావుతో పాటు తండా వాసులు పాల్గొన్నారు.

సీఐకు శుభాకాంక్షలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలి) సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీహరిని బుధవారం స్టేషన్ పరిధిలోని పలు పార్టీల నాయకులు, కార్పొరేటర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సుధాకర్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగరాజు, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ నామా జన్మదిన వేడుకలు

ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను బుధవారం ఆయా మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు చేపట్టి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్


తిరుమలాయపాలెం: బీరోలులో వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

18న ఇంటర్వ్యూలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించేందుకు ఒక గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈ నెల 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16, 17వ తేదీల్లో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుండగా.. 18న ఉదయం 10గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనుండగా ఉదయం 9:30 గంటలకే అభ్యర్థులు చేరుకోవాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లివాసులకు బుధవారం ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్, ఈ–శ్రమ్ కార్డులపై బీజేపీ మహిళా మోర్చా నాయకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు దొడ్డ అరుణ, డివిజన్ అధ్యక్షురాలు అనితారెడ్డి మాట్లాడుతూ.. పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా ఆయుష్మాన్ భారత్ పథకం, ప్రమాదం, సహజ మరణాలకు బీమా వర్తించేలా ఈ–శ్రమ్ కార్డు చేయించుకోవాలని, ఈ కార్డు కోసం మీ సేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భట్టి పాదయాత్ర విజయవంతానికి పూజలు

నేలకొండపల్లి: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ బుధవారం స్థానిక శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బచ్చలకూరి నాగరాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఈ యాత్ర ద్వారా ఎండగట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, నాయకులు అప్పారావు, రుషికేష్, ఎం.నాగేశ్వరరావు, యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్, యాతాకుల శ్రీనాథ్, వీరబాబు, వినోద్, పెద్దపాక ముత్తయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఖమ్మం అర్బన్ సీడీపీఓ కవితకు బీఆర్ఎస్ కేవీ అంగన్‌వాడీ విభాగం యూనియన్ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. ఎండ తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట నిర్వహించాలని, సాంకేతిక లోపాల కారణంగా పోషణ ట్రాక్ అప్‌డేట్ కావటం లేదన్నారు.కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు మాటూరి లక్ష్మీనారాయణ, ప్రతినిధులు పారిజాతం, బాలకుమారి, ఉమా, భార్గవి, రాణి, లక్ష్మి, శోభ, ఝాన్సీ, పద్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

జెండా, అజెండా లేని వారు విమర్శిస్తారా?

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు


మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన నాయకులు

ఖమ్మం వైరారోడ్: జెండా, అజెండా లేని వారు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయటం గర్హనీయమని ఆ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు బీఆర్ఎస్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించిన వారు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ల కాలంలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలో సాధ్యమైందని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు అమలుచేస్తుండగా, డీసీసీబీ బ్యాంక్ నిధులు దోచుకున్న వారు విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. కాగా, పొంగులేటి వద్ద రాజకీయ నిరుద్యోగులే మిగిలారని, వారి విషయంలో జాగ్రత్తగా ఉండటం మంచిదని పొంగులేటికి సూచించారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నేతలంతా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి అజయ్‌కుమార్ వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కమర్తపు మురళి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో పాటు బెల్లం వేణు, ఖమర్, చింతనిప్పు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

భూములకు నష్టపరిహారం చెల్లించాలి


దీక్షలో మాట్లాడుతున్న ఇబ్రాయిల్

తిరుమలాయపాలెం: మహ్మదాపురం పరిధిలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం లేదా భూమిని ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మందడి ఇబ్రాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మహ్మదాపురం గురుకులం వద్ద బుధవారం రైతులు చేస్తున్న దీక్షలకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. గత రెండు రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు పురుగుల మందు డబ్బాలతో నిరసన చేపట్టారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాజా సత్యనారాయణ, నాయకులు బాలునాయక్, నరేష్, రైతులు భారతి, బుజ్జి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో.. ప్రజా ఉద్యమాలు.

ఖమ్మంరూరల్: అమరవీరుల స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి. రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని నాయుడుపేటలో జరిగిన నందిగామ వెంకన్న వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరువీరుల త్యాగాలతో ఉద్యమాలు నిర్మించినప్పుడే వారికి నిజమైన నివాళి అందుతుందని తెలిపారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల17న నుంచి ప్రారంభం కానున్న జనచైతన్య యాత్రకు ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలపాలని పేర్కొన్నారు. ఈయాత్ర 23న మండలంలోని ఎంవెంకటాయపాలెంలోకి చేరుకుంటుందని, అక్కడ జరిగే బహిరంగ సభకు వేలాదిగా అభ్యుదయవాదులు, సంఘసంస్కర్తలు, రైతులు, మహిళలు యువత తరలి రావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, నాయకులు సుదర్శన్‌రెడ్డి,నర్సింహారావు, గోవిందరావు,రఘు,లక్ష్మి, మధు, నాగరాజు, పుల్లయ్య, రమ్యారావు పాల్గొన్నారు.

'రాయల'కు పలువురి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు

తిరుమలాయపాలెం: ఇటీవల పిండిప్రోలు గ్రామ సర్పంచ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకుడు రాయల నాగేశ్వరరావు మృతి చెందగా.. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం వేర్వేరుగా పిండిప్రోలులో రాయల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్‌రావుతో పాటు బండి రమేష్, కొమ్ము శ్రీను, సాధు రమేష్‌రెడ్డి, బండి జగదీష్, పద్మనాభుల సుధాకర్, వెంకట్రావు, పప్పుల ఉపేందర్, నిర్మల్‌రావు, రవి, బానోత్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

నేలకొండపల్లి: కుక్కల దాడిలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని కోరట్లగూడెంకు చెందిన అఖిల్, అనాసాగారానికి చెందిన జ్యోతి, మంగ్రాజుపల్లికి చెందిన బేజియా కుక్కల దాడిలో గాయపడగా, బుద్ధారానికి ఓ యువకుడిని ఎలుక గాయపర్చడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

మందు తెమ్మని ఫోన్ చోరీ

నేలకొండపల్లి: మాయమాటలు చెప్పి సెల్‌ఫోన్ కొట్టేసిన ఘటన ఇది. మండలంలోని ఆచార్లగూడెంకు చెందిన వెంకటేశ్వర్లు బుధవారం స్థానిక సెంటర్‌లో ఉండగా, ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి తన సోదరుడిగా పరిచయం చేసుకుని వైన్స్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ డబ్బులు ఇచ్చి మందు తీసుకురావాలని కోరిన ఆ వ్యక్తి.. ఒకరి కాల్ చేయాలంటూ వెంకటేశ్వర్లు ఫోన్ తీసుకుని బయటకు వెళ్లాడు. ఎంతసేపటికీ సదరు వ్యక్తి రాకపోవడంతో ఫోన్ చోరీ అయినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫోన్ కాల్‌తో స్పందించిన కమిషనర్

తనిఖీలు చేపట్టిన గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్

నేలకొండపల్లి: సార్... వాడిన నూనె మళ్లీ వాడుతున్నారంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదని రాష్ట్ర ఆహార తనిఖీ శాఖ కమిషనర్‌కు ఓ యువకుడు ఫోన్ చేయడంతో స్పందన లభించింది. నేలకొండపల్లిలోని వైన్స్ సమీపాన ఓ దుకాణానికి బుధవారం వెళ్లిన గోపి ఆమ్లెట్ వేయాలని సూచించగా, అప్పటికే వాడిన నూనెతో వేస్తున్నారు. దీంతో ఆయన వారించడంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయమై గోపి వెంటనే జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో కమిషనర్‌కు ఫోన్ చేయగా ఆయన సూచనలతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ చేరుకున్నారు. అక్కడ శాంపిల్స్ సేకరించడంతో పాటు మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో కూడా తనిఖీ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష ప్రారంభం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం మండలాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీచేశారు. నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోగా నిర్వాహకులు తనిఖీ చేసి లోనికి పంపారు. తాగునీరు,టెంట్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు


నేలకొండపల్లిలో తనిఖీలు చేస్తున్న అధికారులు


ఆలస్యంగా రావడంతో బయట ఉన్న విద్యార్థి కొండా వినయ్


కూసుమంచిలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


పరీక్షా కేంద్రం బయట వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు